## క్లుప్తంగా

### నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎస్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

### శాస్త్రోక్తంగా చండీ హోమం



లలితాపీఠంలో హోమం చేస్తున్న వేద పండితులు

సీతంపేట: అక్కయ్యపాలెం లలితానగర్‌లోని లలితాపీఠంలో బహుళ అష్టమి సందర్భంగా చండీ హోమం నిర్వహించారు. పీఠం అర్చకులు, పండితుల వేదమంత్రాల నడుమ హోమం శాస్త్రోక్తంగా జరిగింది. లోకకల్యాణం, విశేష కార్యసిద్ధి కోసం జగన్మాతను ఆరాధించడంలో భాగంగా చండీ హోమం నిర్వహించినట్టు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

### లలితా దీక్షలు ప్రారంభం



స్వామీజీ చేతుల మీదుగా దీక్ష తీసుకుంటున్న భక్తులు

సీతంపేట: అక్కయ్యపాలెం లలితాపీఠంలో లలితా దీక్షలు సంక్రాంతి రోజు ప్రారంభం అయ్యాయి. సంక్రాంతి నుంచి మాఘ పౌర్ణమి వరకు దీక్షధారులు 21 రోజుల పాటు దీక్షలో ఉంటారని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. కుర్తాళం నుంచి వచ్చిన పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ స్వామి శిష్యులు ఆదిత్యానంద భారతి స్వామి చేతుల మీదుగా పలువురు భక్తులు దీక్ష తీసుకున్నారు. ఈ సందర్భంగా లలితాదేవికి ప్రత్యేక పూజలు చేశారు.

### 'సినిమా బండి' చిత్ర ప్రదర్శన రేపు

సీతంపేట: నగరానికి చెందిన వర్ధమాన దర్శకుడు ప్రవీణ్ కాండ్రేగుల దర్శకత్వంలో రూపొంది, జాతీయ అవార్డు పొందిన 'సినిమా బండి' తెలుగు చిత్రాన్ని 18వ తేదీ ఉదయం 9:45 గంటలకు విశాఖ పౌరగ్రంథాలయంలో ప్రదర్శించనున్నట్టు వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. సినిమా ప్రదర్శన అనంతరం దర్శకుడు ప్రవీణ్‌తో ముఖాముఖి, సత్కార కార్యక్రమం ఉంటుందని తెలియజేశారు. ఉచిత ప్రవేశం కల్పిస్తున్నామని, ఔత్సాహికులు పాల్గొని, కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

### రైతుబజారు ఖాళీ



ఖాళీగా ఉన్న రైతుబజారు

సీతమ్మధార: సంక్రాంతి పండగ ప్రభావం రైతు బజార్లపై పడింది. నగరవాసులంతా సొంతూళ్లకు వెళ్లడంతో నగరం చాలావరకు ఖాళీ అయింది. దీంతో కొనుగోలుదారులు లేక సీతమ్మధార రైతుబజారు వెలవెలబోయింది. రైతులు విక్రయాల కోసం తెచ్చిన కూరగాయలు, ఆకు కూరలు మొదలైనవి మిగిలిపోవడంతో, వాటిని వెనుకకు తీసుకువెళ్లాల్సి వచ్చింది.

# సరదాల సందడి



31వ వార్డులో సంక్రాంతి పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న బాపూ ఆనంద్



30వ వార్డు తాడివీధి రామాలయం వద్ద గంగిరెద్దుకు పూజలు చేస్తున్న దృశ్యం



స్వామి వివేకానంద సంస్థలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో కొండా రాజీవ్‌గాంధీ తదితరులు

డాబాగార్డెన్స్: సంక్రాంతి..కనుమ పండగలతో ఆది, సోమవారాల్లో నగరంలో వీధులన్నీ సందడిగా మారాయి. ప్రతి వీధిలోను సంక్రాంతి పండగకు గుర్తుగా పతంగుల తోరణాలు ఏర్పాటు చేశారు. పలు యువజన సంఘాలు, గ్రామ సేవా సంఘాలు చిన్నారులు, మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. కొత్త బట్టలు ధరించిన పిల్లలు, పెద్దలతో వీధుల్లో హడావిడి చేశారు. రంగు రంగుల రంగవల్లులతో వీధులు ఇంద్రధనస్సును తలపించాయి. డాబాగార్డెన్స్, మహారాణిపేట, అంగటిదిబ్బ, భుజంగరావుపేట, రెల్లివీధి, వేంకటేశ్వరమెట్ట, అల్లిపురం, సూర్యాబాగ్, పాతపోస్టాఫీస్, కోటవీధి, బురుజుపేట, పప్పులవీధి, చాగంటివారివీధి, కొబ్బరితోట, జెండా చెట్టువీధి తదితర ప్రాంతాల్లో పలు యువజన సంఘాలు, మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. మరికొన్ని ప్రాంతాల్లో వంటల పోటీలు నిర్వహించారు. విజేతలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

**అనాథాశ్రమంలో సంక్రాంతి సంబరాలు..**

పాతనగరం వాడవీధిలో గల వివేకానంద ఆశ్రమంలో సంక్రాంతి సంబరాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆశ్రమంలోని అనాథ వృద్ధులు నూతన వస్త్రాలు ధరించి సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ పాల్గొని వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. సంస్థ మహిళా సభ్యులు సంస్థ ముందు రంగు రంగుల రంగవల్లులు వేశారు.

# బుడగ జంగాల హడావుడి



విశాఖ నుంచి కోటిపల్లి రేవుకు తరలి వెళ్తున్న బుడగ జంగాలు



దుర్గాలమ్మ గుడి జంక్షన్ వద్ద ఓ వ్యక్తిని పొగుడుతున్న బుడగ జంగా

డాబాగార్డెన్స్: నగరంలో బుడగ జంగాళ్లు హడావిడి చేశారు. తూర్పుగోదావరి జిల్లా కోటిపల్లి రేవు నుంచి సుమారు 200 మంది పైబడి బుడగ జంగాళ్లు భోగిపండగ ముందు రోజే నగరానికి విచ్చేశారు. వీరంతా నగరంలోని వెలంపేట, ప్రసాద్‌గార్డెన్స్, కల్లుపాకలు, కొబ్బరితోట, రామకృష్ణా జంక్షన్ ఏరియా, అల్లిపురం, మహారాణిపేట, సాలిపేట, కోటవీధి, వన్‌టౌన్ ఏరియా, పంజా జంక్షన్, పెయిన్‌దొరపేట, సూర్యాబాగ్, డాబాగార్డెన్స్, లక్ష్మీనగర్, పద్మానగర్, చిలకపేట తదితర మురికివాడ ప్రాంతాలతో పాటు అఫీషియల్ కాలనీ, ఎంవీపీ, విశాలాక్షి నగర్, సీబీఎం కాంపౌండ్ తదితర ప్రాంతాల్లో గత మూడు రోజులుగా తిరుగుతూ..అపార్టుమెంట్లు, కాలనీ వాసుల ఇళ్లకు వెళ్లి పితృదేవతలకు పూజలు నిర్వహించి..నేరుగా పితృదేవతలే ఇంటికి దిగివచ్చినట్టు పొగుడుతూ ఎంతో కొంత నగదు తీసుకుని దీవించారు. కనుమ పండగ ముగించుకున్న తర్వాత వీరంతా తిరిగి కోటిపల్లి రేవుకు తరలివెళ్లారు.

**గంగిరెద్దుల హడావిడి..**

నగర శివార్లతో పాటు కొత్తవలస, చింతల అగ్రహారం, ఆనందపురం, కొమ్మాది, దేవరాపల్లి తదితర ప్రాంతాల నుంచి అనేక మంది గంగిరెద్దుల వారు పండగ ముందు రోజునే విశాఖ చేరుకున్నారు. వీరంతా నగరంలోని వివిధ ప్రాంతాల్లో సందడి చేశారు. ఇంటింటికి వెళ్లి పొగుడుతూ ఎంతో కొంత తీసుకునే వారు. పండగ మూడు రోజులు వీరంతా ఉదయం నుంచి రాత్రి 10 గంటల వరకు అన్ని ప్రాంతాలు తిరిగి బౌడరారోడ్డు, గోకుల్ థియేటర్ తదితర ప్రాంతాలకు చేరుకునేవారు. కనుమ పండగ రోజున వీరంతా వారి వారి ప్రాంతాలకు వెళ్లిపోయారు.

# కనుల పండువగా వెంకన్న తిరువీధి

నేడు పరస మహోత్సవం



తిరువీధి ఉత్సవ సేవ అందుకుంటున్న శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి



స్వామివారి వింజామర సేవలో పాల్గొన్న భక్తులు



ఉత్సవ విగ్రహాలకు నక్షత్ర హారతి ఇస్తున్న ఆలయ అర్చకుడు

అల్లిపురం: శ్రీదేవి, భూదేవి సమేత బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి తిరువీధి ఉత్సవం సోమవారం కన్నుల పండువగా నిర్వహించారు. కనుమ పండగ సందర్భంగా ఆలయ అర్చకుడు గొడవర్తి రాఘవాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించారు. అనంతరం ఉత్సవ మూర్తులను పల్లకిలో ఏర్పాటు చేసి మేళ, తాళాలు, మంగళ వాయిద్యాలతో ఆలయం నుంచి దేవస్థానం ఉత్సవ కమిటీ సభ్యులు ఆడారి వెంకటమహేష్, బొడ్డేటి కిషోర్, యల్లంకి చిన్నమ్మలు, కణితి గోవిందమ్మ, కర్రి నీలకంఠం, కొల్లి సత్యవతి, ఒమ్మి మోహనరావు, పాల శ్రీహరిరెడ్డి, కొడమంచిలి శ్రీను అధిక సంఖ్యలో భక్తులు పల్లకి మోసారు. ఈ సందర్భంగా బల్లిగిరి గోవింద నామస్మరణతో మార్మోగింది. తిరువీధిలో ప్రజలు స్వామికి అడుగడుగునా హారతులిచ్చి స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. తిరువీధి అనంతరం స్వామి ఇరువురు దేవేరులతో కలిసి ఆలయ ప్రవేశం చేశారు. స్వామికి ఆలయ అర్చకులు విశేషంగా పంచహారతి, నక్షత్ర హారతి, కుంభ హారతి నిర్వహించారు.

**నేడు పరస మహోత్సవం**

బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక పరస మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఉదయం నుంచి భక్తుల దర్శనాలకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

# ట్రాఫిక్ వలంటీర్లకు ఆహ్వానం

మద్రిపాలెం: ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు, రోడ్డు ప్రమాదాల నివారణకు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కంచరపాలెం ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో పని చేసేందుకు వలంటీర్లు కావాలని ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు తెలిపారు. ఆసక్తి గల యవకులు, వ్యాపారులు, ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, సంఘసేవకులకు అవకాశం కల్పిస్తున్నట్టు తెలియజేశారు. ముఖ్యమైన కూడళ్లలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు, ట్రాఫిక్ పోలీసులకు సహకరించేందుకు, ట్రాఫిక్ రూల్స్ ప్రచారం చేసేందుకు, కౌన్సెలింగ్ చేసేందుకు ఆసక్తిగలవారు సంప్రదించాలని సూచించారు. కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో కంచరపాలెం, ధర్మానగర్, దుర్గానగర్, జ్ఞానాపురం, ఊర్వశి, కప్పరాడ, మాధవధార, మురళీనగర్, ఐటీఐ జంక్షన్, మద్రిపాలెం, 104 ఏరియా, కరాస, బర్మానగర్, ఎన్ఏడీ, బుచ్చిరాజుపాలెం, విమాన్ నగర్, కాకానినగర్, ఎన్ఎస్‌టీఎల్ ప్రాంతాల్లో నివసిస్తున్న ఉత్సాహవంతులైన వారు ముందుకు రావచ్చన్నారు. ట్రాఫిక్ పోలీసుతో కలిసి వలంటీర్‌గా పని చేయాలనుకునే వారు నేరుగా కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో లేదా ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావును 9440796037 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

# స్టేడియం చుట్టూ దుకాణాలు నిర్మించాలి

- పాతనగరం యువత డిమాండ్



స్టేడియంను ఆక్రమించుకుని వెలసిన దుకాణాలు



దుకాణాలు నిర్మించాలని అప్పటి మంత్రికి వినతి పత్రం ఇస్తున్న కార్పొరేటర్ భాస్కరరావు (ఫైల్)

జగదాంబ: నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని పాతనగరం యువత కోరుతున్నారు. జీవీఎంసీ 35వ వార్డులో ఉన్న ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియం గతంలో అంగరంగ వైభంగా వెలుగొందిన విషయం తెలిసిందే. అయితే కొత్తగా నిర్మాణం చేపట్టిన డాక్టర్ వైఎస్సార్ క్రికెట్ స్టేడియం నిర్మాణం అయిన తరువాత ఈ స్టేడియంలో కనీసం రంజీ మ్యాచ్‌లు కూడా జరగలేదు. దీంతో స్టేడియంలో జీవీఎంసీ కార్యాలయాలు ఏర్పాటు చేస్తే బయట స్టేడియం చుట్టూ పలువురు ఆక్రమించుకుని వ్యాపారాలు చేసుకుంటున్నారు. వన్‌వే నుంచి రహదారిలో బడ్డీ దుకాణాలు, మంచాలవీధి వైపు ఉన్న ప్రహరీ చుట్టూ స్క్రాప్ దుకాణాలు, 75 ఫీట్ రోడ్డు చుట్టూ స్క్రాప్ వాహనాలు పెట్టుకుని వ్యాపార లావాదేవీలు జరుపుకుంటున్నారు. దీని వలన జీవీఎంసీకీ కనీసం ఒక్క రూపాయి కూడా ఆదాయం రావడంలేదు. కొన్ని దుకాణాలకు అయితే ట్రేడ్ లైసెన్సులు కూడా లేకుండా వ్యాపారాలు చేసుకుంటున్నారు.

**దుకాణాల నిర్మాణం చేపడితే...**

స్టేడియం చుట్టూ జీవీఎంసీ దుకాణ సముదాయలు చేపడితే సుమారు మూడు వందల దుకాణాలు నిర్మాణం జరుగుతాయి. దీని వలన ఆక్రమణలు తగ్గడంతో పాటు యువతకు ఉపాధి దొరుకుతుందని యువత చెబుతున్నారు. అంతే కాకుండా జీవీఎంసీకి చక్కటి ఆదాయం వస్తుందని అంటున్నారు. ముఖ్యంగా పూర్ణామార్కెట్ ప్రధాన రహదారి, వన్‌వే ప్రధాన రహదారిలో ఉన్న ఆక్రమణలు తొలగిపోయి యువతకు జీవనోపాధి దొరుకుతుందని అంటున్నారు.

**నివేదిక ఇచ్చినా.. స్పందన లేదు..**

ఇందిరా ప్రియదర్శిని స్టేడియం చుట్టూ దుకాణ సముదాయం నిర్మించి యువతకు స్వయం ఉపాధి కల్పించాలి కోరుతూ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు మున్సిపల్ శాఖ మాజీ మంత్రి అదిమూలపు సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. అంతే కాకుండా అప్పటి జీవీఎంసీ కమిషనర్ లక్ష్మీ శకు కూడా వినతిపత్రం అందించారు. అయితే అప్పటి నుంచి పనులు మాత్రం ముందుకు సాగలేదు. జీవీఎంసీ ఉన్నతాధికారులు స్పందించి దుకాణ సముదాయలు చేపట్టి యువతకు ఉపాధి కల్పించాలని పలువురు కోరుతున్నారు.

# ముగ్గుల పోటీల విజేతలకు బహుమతుల అందజేత



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

సీతంపేట: సంక్రాంతి సందర్భంగా శ్రీ యశోద కృష్ణ సేవా సంఘం ఆధ్వర్యంలో సీతంపేట కూడలిలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల మహిళలు ఉత్సాహంగా పాల్గొని, రంగు రంగుల ముగ్గులు వేశారు. 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ముఖ్య అతిథిగా పాల్గొని, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ముద్దాడ యల్లాజీ, ప్రధాన కార్యదర్శి బీసపు శ్రీనివాస్, సభ్యులు జోగా శ్రీను, పిల్లల మోహన్, పల్లా పాపారావు తదితరులు పాల్గొన్నారు.

# నమో శివరుద్రాయ..



ఉమాచంద్రమౌళీశ్వరస్వామి

సింహాచలం: అడవివరం విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం పరమేశ్వరుడికి విశేషంగా అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఉమాదేవి అమ్మవారికి కుంకుమపూజలు నిర్వహించారు. భక్తులు హర నామస్మరణలో మునిగితేలారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

# అప్పన్న గోశాలలో ఘనంగా గోపూజలు



గోవులకు పూజ చేస్తున్న ట్రస్ట్‌బోర్డు సభ్యులు, భక్తులు

సింహాచలం: కనుమ పండగను పురస్కరించుకుని శ్రీకృష్ణాపురంలోని గోశాలలో సోమవారం గోపూజలు విశేషంగా జరిగాయి. గోశాలలోని ఆవులకు భక్తులు పసుపుకుంకమలు సమర్పించారు. గోశాల ప్రాంగణంలోని శ్రీకృష్ణుడి విగ్రహం చెంత విశేషంగా పూజలు నిర్వహించారు. శ్రీకృష్ణాష్టకం పఠించారు. విశేషంగా హారతులు అందజేశారు. దేవస్థానం వేద పండితుడు కాళ్లకూరి సుబ్రహ్మణ్యేశ్వరశర్మ పూజలను నిర్వహించారు. ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, శ్రీదేవివర్మ, దినేష్‌రాజ్, ప్రత్యేక ఆహ్వానితుడు చందు యాదవ్ పూజల్లో పాల్గొన్నారు. సూపరింటెండెంట్ గొడవర్తి ప్రసాద్, సిబ్బంది సూర్యనారాయణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

# స్టీల్‌ప్లాంట్ రక్షణకు ప్రజా ఉద్యమం



దీక్షలో పాల్గొన్న అష్రాఫ్.. ఇతర నాయకులు

సీతమ్మధార : ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్‌పరం కాకుండా రక్షించుకుంటామని, స్టీల్‌ప్లాంట్ రక్షణకు ప్రజా ఉద్యమం చేస్తామని ఆవాజ్ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి అష్రాఫ్ అన్నారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద అఖిలపక్ష కార్మిక ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన నిరాహార దీక్ష శిబిరంలో మద్దిలపాలెం జోన్ సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అష్రాఫ్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలు ఏర్పడిన దగ్గర నుండి ఇప్పటి వరకు లక్షలాది మందికి ఉపాధి దొరికిందన్నారు. 32 మంది బలిదానం చేశారని అన్నారు. కరోనా కష్టకాలంలో విశాఖ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వరంగ సంస్థలు తమ వంతు పాత్రను పోషించి ప్రజలకు భరోసాగా నిలిచాయన్నారు. 2024 ఎన్నికల్లో బీజేపీని నామరూపాలు లేకుండా చేస్తామని హెచ్చరించారు. బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను విదేశీ, స్వదేశీ పెట్టుబడిదారులకు అమ్మేయాలని చూడడం అవివేకమన్నారు. ఇప్పటికైనా మోదీ ప్రభుత్వం ప్రైవేటీకరణ విధానాలు మానుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వెంకటరావు, ఎ. సీతాలక్ష్మి, కుమారి, జీవీఎస్ చలపతిరావు, పి.అప్పారావు, ఆవాజ్ నాయకులు మహమ్మద్ అయూబ్, అబ్దుల్ మునీర్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా మకరవేట

- వరదరాజస్వామిగా సింహాద్రి అప్పన్న
- విశేషంగా గ్రామ తిరువీధి
- పరవశించిన భక్తజనం



కొండపై నుండి పూలతోటలోకి స్వామిని తిరువీధిగా తీసుకొస్తున్న భక్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి మకరవేట(గజేంద్రమోక్షం) ఉత్సవం సోమవారం కనుల పండువగా జరిగింది. కొండదిగువ పూలతోటలో ఈ ఉత్సవాన్ని సింహాచలం దేవస్థానం వైదికులు ఘనంగా నిర్వహించారు. వరాహ లక్ష్మీనృసింహ స్వామి వరదరాజస్వామి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చాడు. స్వామిని కనులారా తిలకించిన భక్తులు భక్తి పారవశ్యంలో మునిగితేలారు. రెండు చేతులు జోడించి స్వామికి జేజేలు పలికారు. స్వామి వారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వరదరాజస్వామిగా అలంకరణ చేసి సాయంత్రం సింహగిరి నుంచి మెట్లమార్గం ద్వారా కొండదిగువకు తీసుకొచ్చారు. తొలిపావంచా వద్దకు చేరుకున్న స్వామికి అడవివరం గ్రామస్తులు, దేవస్థానం అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుంచి స్వామిని ఆయన సోదరి అయిన అడవివరం గ్రామదేవత పైడితల్లి అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా తీసుకెళ్లారు. అక్కడ స్వామికి మహిళలు మంగళహారతులిచ్చారు. అక్కడి నుంచి స్వామిని పూలతోటకి తీసుకెళ్లి ప్రధాన మండపంలో అధిష్టంపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, షోడశోపచార పూజలు నిర్వహించారు. అనంతరం భాగవత పురాణ విన్నపం, గజేంద్ర మోక్షం ఘట్ట విన్నపం చేశారు. తదుపరి స్వామిని అక్కడి నుంచి పుష్కరిణి సత్రం వద్దకు తీసుకొచ్చి గజవాహనంపై అధిష్టించారు. రాత్రి గ్రామ తిరువీధి విశేషంగా చేశారు. తమ ఇళ్ల ముందుకు వచ్చిన స్వామికి గ్రామస్తులు విశేషంగా హారతులిచ్చారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు, పవ్‌కుమారాచార్యులు, చిన్నా తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, దినేష్‌రాజ్, ప్రత్యేక ఆహ్వానితుడు చందుయాదవ్ తదితరులు ఉత్సవంలో పాల్గొన్నారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని దేవస్థానం ఈఈ త్రినాథరావు ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ అధికారులు ఏర్పాట్లు చేశారు. పూలతోటను పెద్ద ఎత్తున విద్యుద్దీపాలతో అలంకరించారు. గోపాలపట్నం పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని పూలతోటలోని కొలను వద్ద మూడుసార్లు వెలిగించిన జువ్వలు మూడు వెళ్లి తిరిగి రావడంతో ఈఏడాది వరి, అపరాలు, మెట్ట పంటలు బాగా పండుతాయని విశ్వసించారు.

# సుదీర్ఘ పోరాట ఘనత ఉక్కు కార్మికులదే..



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ఒక పరిశ్రమ పరిరక్షణ కోసం సుదీర్ఘ పోరాటం చేసిన ఘనత విశాఖ ఉక్కు కార్మికులకే దక్కుతుందని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. ఇంతకు ముందు దేశంలో ఎక్కడా ఇలా జరగలేదన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన ఉక్కు రిలే దీక్షల్లో 704వ రోజు, సోమ వారం దీక్షలో కార్మికులతో పాటు 66వ వార్డు కార్పొ రేటర్ మహ్మద్ ఇమ్రాన్, ముస్లిం సోదరులు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, ఎన్.రామారావు, కె.ఎస్.ఎన్.రామారావు, ఎన్.రామచంద్రరావు, జె.రామకృష్ణ, వై.మస్తానప్ప తదితరులు ప్రసంగించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ సుమారు రెండు సంవత్సరాలుగా కార్మికులు పోరాటం కొనసాగిస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని, కార్మికులంతా ఏకమై ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలని కోరారు. ప్లాంట్‌లో విభాగాలను పునఃప్రారంభించి ఉత్పత్తిని పెంచాలన్నారు. ఈ నెల 30న జరప తలపెట్టిన ఉక్కు ప్రజాగర్జనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు ఇతర కార్మికులు పాల్గొన్నారు.